*తేదిః- 03.12.2015*

**సప్త సముద్రాలు, షట్చక్రవర్తులు, సప్తఋషులు, ఏడు వింతలు, అష్టదిగ్గజాలు.....**

# కానీ ఒకే ఒక్క అనంతపురము

## అనంతపురం జిల్లా ప్రత్యేకతలు ప్రాముఖ్యాలు

**డా॥ వై. వి. మల్లా రెడ్డి**

---

*అడుక్కు తినేవాడికి అవిటివాడు అవసరమైనట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి (విభజనకు ముందు తరువాత కూడా) అడుక్కోవడానికి చిక్కిన ఏకైక అవిటి జిల్లా అనంతపురము. రాష్ట్రానికి నీటి కోసం బచావత్ ట్రిబ్యునల్ ముందుగానీ, బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు గానీ, రాష్ట్ర అభివృద్ధి నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం ముందుగానీ, ప్రపంచ బాంకు ముందుగానీ. . . . అనంతపురము జిల్లా కరువును దారిద్ర్యాన్ని, వెనుకబాటుదనాన్ని ఎరగా చూపుతారు. తీరా కేటాయింపులకొచ్చేసరికి, తినే కూరలో కరివేపాకును తీసేసినట్లు తీసి ప్రక్కన పెడతారు. అందుకే అనంతపురము జిల్లా "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుగా వుంది.*

* * * * * *

### 1. ఎండబారిన (Arid) ఎడారి (Desert) అనంతపురము జిల్లా లో వర్షాభావ పరిస్థితి ః

అనంతపురం జిల్లా రాష్ట్రంలోనేగాక, మన దేశంలోనే అత్యధిక విస్తీర్ణం కల్గిన జిల్లాలలో ఒకటి. జిల్లా విస్తీర్ణము 19.13 లక్షల హెక్టార్లు (48 లక్షల ఎకరాలు). దీని భౌగోళిక పరిస్థితులు దేశంలోని ఏ ఇతర జిల్లాలతో పోల్చుకున్నా, భిన్నంగా, తీవ్రంగా, ప్రత్యేకంగా వుంటాయి. దక్షిణ భారత దేశంలో నట్టనడిబొడ్డున వుంటూ, "వర్షచ్ఛాయా ప్రాంతా"నికి కేంద్ర బిందువుగా అనంతపురము జిల్లా వుంది. దక్షిణ భారతంలోని వర్షచ్ఛాయా ప్రాంతము (Rain Shadow Area) అనంతపురం జిల్లా నడిబొడ్డు నుండి, అంటే కూడేరు, ఆత్మకూరు మండలాలు కేంద్రబిందువుగా, అతి తక్కువ వర్షపాతం 340 మీ.మీ తో మొదలై చుట్టూ వున్న కడప, కర్నూలు, చిత్తూరు, బళ్ళారి, చిత్రదుర్గ, తుముకూరు, చిక్కబళ్ళాపూరు జిల్లాల వైపు వ్యాపిస్తు, వర్షపాతం కొంత మెరుగవుతూ పోతుంది. అందుకే దక్షిణ భారత దేశంలోనే అత్యల్ప సగటు వర్షపాతం (552 * మి. మీ) గల జిల్లాగా అనంతపురం జిల్లా వుంది. తూర్పున బంగాళాఖాతానికి, పశ్చిమాన అరేబియా సముద్రానికి, ఇరు వైపులా 350 కి. మీ. సమ దూరంలో వుంది. తూర్పున తూర్పు కనుమలు (నల్లమలై అడవులు) పడమర పడమటికనుమలకు కూడా దాదాపు సమాన దూరంలో వుండడం కారణంగా ఇటు నైరుతి ఋతు పననాలు, అటు ఈశాన్య ఋతుపనవాలు కూడా అనంతపురం చేరే లోపల మేఘాలు బలహీనపడి వర్షాచ్ఛాయ / వర్షాభావ ప్రాంతాంగా ఏర్పడిందని చెపుతుంటారు. జిల్లాలో నైరుతి వైపున ఉన్న మండలాలపైన నైరుతి ఋతు పవనాల ప్రభావం కొంత ఎక్కువగా వుండి వర్షపాతం కూడా కొంత మెరుగ్గా వుంటుంది. అలాగే ఆగ్నేయ మండలాలపైన ఈశాన్య ఋతుపనవాల ప్రభావం కొంత మెరుగ్గా వుంటుంది.

---

*జిల్లా సగటు వర్షపాతం 521 మి. మీ. 544 మీ. మీ. 552 మీ. మీ. ఇట్లా వేర్వేర చోట్ల చెప్పుతుంటారు. ప్లానింగ్ శాఖ, వాతావరణ శాఖ వారు సరాసరి లెక్కించే సంవత్సరాలను బట్టి, మరియు ఆ శాఖ క్రింద ఉన్న Rain Gauge Stations ను బట్టి కొంత తేడాలు ఉండడం సాధారణమే. ఈ తేడాలకు ఏమి ప్రాముఖ్యత లేదు.

వర్షాకాలం సాధారణంగా జూన్ నెల మొదటి వారంలో నైరుతి రుతుపవనాలతో మొదలవుతుంది. సెప్టంబర్ చివరి నాటికి నైరుతి ఋతుపవనాలు బలహీనపడతాయి. నైరుతి రుతుపవన కాలంలో దాదాపు 335 మి. మీ. సగటు వర్షం కురుస్తుంది. అక్టోబరు మొదటలో ఈశాన్య రుతుపవనాలు మొదలయి నవంబరు వరకు వుంటాయి. అయితే బంగాళాఖాతంలో ఏర్పడే తుపాన్ల మీద ఆధారపడి ఈశాన్య రుతు పవనాల వర్షాలు ఉంటాయి. ఈ కాలంలో దాదాపు 157 మీ. మీ. సగటు వర్షాం కురుస్తుంది. కాబట్టి వర్షాధార పంట కాలము జూన్ నెల నుండి నవంబరు వరకు వుంటుంది. నవంబరు నుండి మే వరకు ఋతుపవనాల ప్రభావం వుండుదు. కానీ ఎండాకాలంలో (మార్చి నుండి మే వరకు) కొన్ని అకాల వర్షాలు సాధారణంగా పడతాయి. ఎండాకాలంలో సగటు వర్షపాతం 64 మీ.మీ. గా వుంది.

**ఇంత దౌర్భాగ్యము ఎక్కడైనా వుంటుందా ?**

అత్యధిక వర్షాధార భూమి కలిగి, అత్యల్ప వర్షపాతం కలిగి, మన యావత్ భారత దేశంలోనే అత్యధికంగా కరువుకు గురవుతున్న జిల్లాగా, ఎండబారిన జిల్లాగా, ఎడారి జిల్లాగా, ప్రసిద్ధి చెందింది ఒక్క అనంతపురం జిల్లా మాత్రమే. గత 16 సంవత్సరాలలో ఏకంగా 14 సంవత్సరాలు కరువులు వచ్చిన జిల్లా మనదేశం లోనే కాదు, ప్రపంచంలో నే ఎక్కడా వుండదు.

తూ.గోదావరి, ప.గోదావరి, కృష్ణా, గుంటూరు లాంటి జిల్లాలలో ఒక్క సంవత్సరానికి మూడు పంటలు పండుతుంటే, అనంతపురము జిల్లాలో 20 సంవత్సరాలలో కూడా మూడు పంటలు పండని పరిస్థితి! ఎంత దౌర్భాగ్యము !

అనంతపురం జిల్లా సగటు వర్షపాతం 552 మి.మీ. వున్నా ఇక్కడ “తేమ ఆవిరి” (Potential Evapo-transpiration, PET) దాదాపు 2,000 మీ.మీ.గా అంచనా వేయబడింది. నేల నుండి మరియు ఆకుల నుండి తేమ ఆవిరి కావడాన్ని “భాష్పీ కరణ” లేదా తేమ ఆవిరి అంటారు. ఉష్ణోగ్రత వలన మరియు గాలివీయడం వలన తేమ ఆవిరి అవుతుంది. చలికాలంలో (డిశంబరు-జనవరి) ఉష్ణోగ్రతలు అత్యల్పంగా 13 నుండి 20 డిగ్రీల సెల్సియస్‌గానూ, అత్యధికంగా 25 నుండి 30 డిగ్రీలు గానూ వుంటాయి. ఫిబ్రవరి నుండి ఉష్ణోగ్రతలు పెరుగట మొదలై ఎండకాలంలో అత్యల్పంగా 25 నుండి 30 డిగ్రీలు అత్యధికంగా 35 నుండి 45 డిగ్రీల వరకు పోవచ్చు. తీవ్రమైన ఎండకాలం మార్చి నుండి మే నెల వరకు వుంటుంది. కాబట్టి ఎండకాలములో వేడికి, గాలికి తేమ ఆవిరి ఎక్కువగా వుంటుంది, అయితే వర్షాకాలంలో కూడా 35 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు మరియు గాలి కాలం కూడా తోడవటం వలన “తేమ ఆవిరి” (PET) ఎక్కువగా వుంటుంది. అనంతపురము జిల్లాలో లోతు తక్కువగా వున్న ఎర్ర నేలలు 80 శాతం, నల్ల నేలలు 20 శాతం వున్నాయి. లోతు లేని ఎర్రనేలలలో వారం, పది రోజులలో తేమ ఆవిరైపోతుంది. తేమ ఆవిరైన తరువాత పంటలు పెరగడం ఆగిపోయి, తరువాత కొన్ని రోజులకు ఎండిపోవడం జరుగుతుంది. అందుకే ఈ జిల్లా “ఎండబారిన” (Arid District) జిల్లాగా, ఎడారి జిల్లా (Desert District) గా కూడా పరిగణించబడింది. దక్షిణ భారత దేశంలో ఒక్క అనంతపురము జిల్లా మాత్రమే, ఎండబారిన ఎడారి జిల్లాగా కేంద్ర ప్రభుత్వము గుర్తించి 1993 వ సం|| లో ఎడారి నివారణ పథకాన్ని (Desert Development Program – DDP) ప్రారంభించింది.

జిల్లాలోనే వర్షపాతంలో మండలాల మధ్య తీవ్రమైన వ్యత్యాసాలు వున్నాయి. అత్యల్పంగా ఆత్మకూరులో సగటు వర్షపాతం 340.9 మి. మీ. కూడేరులో 346.6 మి. మీ. చెన్నేకొత్తపల్లి 353.7 మి. మీ. వుండగా అత్యధికంగా బుక్కపట్నంలో 700.4 మి. మీ. ముదిగుబ్బలో 693.5 మి. మీ. వుంది. సగటు వర్షపాతానికి వాస్తవంగా కురిసే వర్షపాతానికి వ్యత్యాసము (Deviation) 30 శాతంపైగా (హెచ్చుతగ్గులు) వుంటుంది. మరియు క్రమరహితంగా, చెదురు మొదురుగా, అక్కడక్కడగా పడుతుంది. ఈ కారణాల వలన జిల్లాలో వర్షపాత పరిస్థితులు గ్రామాల

మధ్య కూడా వ్యత్యాసము ఎక్కువగా వుంది. సాధారణంగా పదునుకు (20 మీ.మీ) మించి వర్షం పడే "వర్షపు దినాలు" (Rainy Days) ఒక సంవత్సరంలో కేవలం 10 నుండి 20 వరకు వుంటాయి. వర్షాధార పంటకాలము జూలై - నవంబరు మధ్య వర్షపు రోజులు కేవలము 7 నుండి 15 రోజులు మాత్రమే ఉంటాయి. 20 మీ. మీ. (పదును) కు మించి పడే వర్షాలే వర్షాధార పంటలకు ఉపయోగకరంగా వుంటాయి.

ముఖ్యమైన సమస్య ఏమంటే ఒక వర్షానికి ఇంకొకవర్షానికి మధ్య వ్యవధి వరుపు (Dry spell) లేదా బెట్ట చాలా సందర్భాలలో 25 నుండి 45 రోజుల వరకు కూడా వుండటం వలన వరుస కరువులు, తీవ్ర కరువులు సంభవిస్తున్నాయి. పంటకాలములో (జూన్ నుండి నవంబరు వరకు) రెండు, మూడు తడవలుగా ఈ వరుపు / బెట్టలు వస్తున్నాయి. కాబట్టి మొత్తం ఎంత వర్షపాతం పడింది అనేదానికంటే, వర్షపాతం పంటల ఎదుగుదలకు సరిపోయే విధంగా ఒక క్రమ పద్ధతిలో పడిందా అనేది ముఖ్యము.

ఈ మధ్యకాలంలో ఈ వరుపులు (Dry Spells) జూలై - సెప్టంబరు మధ్యకాలంలో ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ నెలలలో వర్షాధార పంటలు ఎదిగే దశలో వుంటాయి, కాబట్టి వరుపులకు తట్టుకోలేక కరువులకు కారణమవుతున్నాయి. కరువులు అన్ని మండలాలను దాదాపు సమానంగానే కబలిస్తూ వుంటాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం గత 16 సంవత్సరాలలో, (1999 నుండి 2015 వరకు ) కేవలం రెండు సంవత్సరాల (2000 మరియు 2007) లో మాత్రమే దాదాపు సాధారణ పంటలు పండినాయి. మిగిలిన 14 సంవత్సరాలు వివిధ మోతాదులలో కరువులు సంభవించినాయి. దీనిని బట్టి అనంతపురము జిల్లాలో వరుస కరువులు ఎంత తీవ్రంగా వున్నాయో అర్థమవుతుంది.

## 1.1 అనంతపురము జిల్లాలో అడవుల పరిస్థితి : చెట్లు లేని అడవి ఇక్కడ ప్రత్యేకం!

అనంతపురం జిల్లా విస్తీర్ణంలో 10 శాతం అడవి వున్నట్లు రికార్డులు చెపుతున్నాయి. ఆశ్చర్యమేమిటంటే, ఇదంతా దాదాపు "చెట్లు లేని అడవి"! కేవలం 2 శాతం అడవి మాత్రం కొంత వృక్ష జాలంతో నిండి వుంది.

## 1.2 1.2 అనంతపురము జిల్లాలో నదుల పరిస్థితి: నీళ్లు లేని నదులు ఇక్కడే సాధ్యం !

అనంతపురం జిల్లాలో పెన్నా, చిత్రావతి నదులతో పాటు, పాపాగ్ని, వేదవతి (హగరి) నదులు ఉన్నాయి. వేదవతి మినహా మిగిలిన నదులన్నీ కర్నాటకలోని దేవనహళ్లి దగ్గరున్న నంది కొండల దగ్గర నుండి పుట్టుకొని వస్తాయి. ఒకప్పుడు ఈ నదులు సరాసరి మూడు సంవత్సరాలకొకసారి పారేవి. ఇప్పుడు 6 సం|| నుండి 10 సం|| లకొకసారి మాత్రమే పారతున్నాయి. అది కూడా ఆద్యంతము వరకు కాకుండా ఉధృతంగా వర్షము పడిన కొన్ని చోట్ల కొన్ని గంటల నుండి గరిష్టంగా రెండు మూడు రోజులు మాత్రమే సాధారణంగా పారతాయి. భూగర్భ జలాలు పై పొరలలో పుష్కలంగా వున్న 1980 సం|| నకు ముందు ఈ నదులలో కొంత స్థాయిలో సజీవ ప్రవాహము కొన్ని నెలలుగా వర్షా కాలం నుండి ఫిబ్రవరి, మార్చి వరకు కూడా వుండేది. బోరు బావులు ఎక్కువై భూగర్భజలాలు అడుగంటిన కారణంగా, ఉధృతమైన వర్షాలు వచ్చిన చోట్ల మాత్రమే కొన్ని గంటలు ఈ నదులు పారుతున్నాయి.

## 1.3 అవంతపురము జిల్లాలో సాంప్రదాయ నీటి వనరులు: ఇన్ని సముద్రాలు, సాగరాలు, చెరువులు . . . ప్రపంచంలో ఎక్కడా వుండవు !

బ్రహ్మ సముద్రము, చోళసముద్రము, బుక్కరాయ సముద్రం, రామసాగరం, కొత్త చెరువు, నల్ల చెరువు, రాయలచెరువు, దేవరచెరవు, కూడేరు, ఓ.డి. చెరువు, ఇప్పేరు, అంతరగంగ, కడదరకుంట. . . ఇలా అనంతపురం జిల్లాలో అనేక గ్రామాల పేర్లు నీటితో సంబంధం వుంటుంది. కానీ నీటికి మాత్రం కరువు వుంటుంది. అనంతపురం జిల్లాలో వున్న ముఖ్య నీటి వనరులు సాంప్రదాయ చెరువులు, కుంటలు. ఇవి చాల వరకు విజయనగర రాజుల కాలములో, అంటే 14 - 15 శతాబ్దాలలో కట్టినవి. నూరు ఎకరాలకు మించి సాగుబడి కల్గిన చెరువులు 303 వున్నాయి. నూరు ఎకరాలకు తక్కువ సాగుబడి కల్గిన చెరువులు 963 వున్నాయి. అదనంగా దాదాపు మూడు వేల చిన్న కుంటలు, చెక్ డ్యాములు ఉన్నాయి. అనంతపురము జిల్లాలోని అన్ని చెరువుల, కుంటల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్ధ్యము దాదాపు 20 టి.ఎమ్.సీ.లు. 40 సం|| క్రితం ఇవి సరాసరి మూడు సంవత్సరాలకొక సారి నిండేవి. ప్రస్తుతం వర్షపాతం తీరులో మార్పులు వచ్చినందు వలన 6 నుండి 10 సం || లకొకసారి మాత్రమే నిండుతున్నాయి. జిల్లాలో భూగర్భ జలాలు పూరించడానికి ఏకైక వనరు ఈ చెరువులు, కుంటలు మాత్రమే. ఈ మధ్య కాలంలో ఈ చెరువులు కుంటలు ప్రత్యక్షంగా పంటలకు గాకుండా చాలా వరకు భూగర్భ జలాలను పూరించే ఊట చెరువులుగా మాత్రమే ఉపయోగపడుతున్నాయి. అయితే భూగర్భజలాల వినియోగం మాత్రము పూరణ కంటే చాలా ఎక్కువగా వున్నది. అనంతపురం జిల్లాలో దాదాపు రెండు లక్షల నుండి రెండున్నర లక్షల బోరు బావులున్నాయి.

## 2. అనంతపురము జిల్లా జనాభా :

అనంతపు జిల్లా జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం 40,83,315. స్త్రీ పురుష నిష్పత్తి ప్రతి వెయ్యి మంది పురుషులకు 977 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారు. జిల్లాలో అక్షరాస్యత శాతం 64.28 వుండగా, పురుషులు 74.09 శాతం మరియు స్త్రీలు 54.31 శాతంగా వున్నది. గ్రామీణ జనాభా దాదాపు 30 లక్షలు, గ్రామీణ కుటుంబాలు దాదాపు 7.5 లక్షలు. దాదాపు 7 లక్షల రైతు కుటుంబాలు వుండగా వారిలో 90 శాతం చిన్న, సన్నకారు రైతులు, ప్రధానంగా ఎస్.సి., ఎస్.టి మరియు బి.సి. వర్గాల వారు. మొత్తం జనాభాలో షెడ్యూలు కులాలు 14 శాతం, షెడ్యూలు తెగలు 3.5 శాతం ఉన్నారు. వెనుకబడిన వర్గాలు 50% శాతం (అంచనా) ఇతరులు 32.5 శాతం (అంచనా) వున్నారు.

## 3. అవంతపురము జిల్లా వ్యవసాయ భూమి: 25 శాతం మెట్ట భూమి ఒక్క అవంతపురం జిల్లాలోనే వుంది !

### 3.1 వరుస కరువులకు గురవుతున్న వర్షాధార భూమి:

అనంతపురం జిల్లాలో సాగుకు అనుకూలమైన భూమి (cultivable land) దాదాపు12 లక్షల హెక్టార్లు (30 లక్షల ఎకరాలు) ప్రస్తుతం సాగులో వున్న భూమి 10.83 లక్షల హెక్టార్లు (27 లక్షల ఎకరాలు). అందులో పూర్తిగా వర్షాధారం క్రింద ఏకంగా 9.65 లక్షల హె. (24లక్షల ఎకరాలు) అంటే 89 శాతం! వరుస కరువులకు గురవుతున్న ఈ వర్షాధార భూమి మన జిల్లాలో దాదాపు 6 లక్షల కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. మొత్తం మన రాష్ట్రంలో 13 జిల్లాలలో వర్షాధారం పైన ఆధారపడిన భూమి 39.11 లక్షల హెక్టార్లు కాగా అందులో

ఆశ్చర్యకరంగా 25 శాతం భాగం (9.65 లక్షల హె.) ఒక్క మన అనంతపురం జిల్లాలోనే వున్నది. మన ఒక్క జిల్లాలోని వర్షాధార భూమి శ్రీకాకుళం (1.41 ల.హె), విజయనగరం (1.71 ల.హె), విశాఖపట్నం(2.23 ల.హె), తూ.గోదావరి (1.62 ల.హె). ప . గోదావరి (1.15 ల.హె), నెల్లూరు (0.9 ల.హె) - ఈ ఆరు జిల్లాలోని వర్షాధార భూమి మొత్తం 9.02 ల.హె కంటే ఇంకా ఎక్కువగా (9.65 ల.హె) అనంతపురము జిల్లాలో వున్నది ! ఆశ్చర్యంగా వుంది కదూ !

ఈ వాస్తవం తెలియని కొంత మంది ప్రభుత్వాధికారులు, ఇతర జిల్లాల రాజకీయ నాయకులలో కూడా ఒక దురభిప్రాయం వుంది. పంటల పెట్టుబడి రాయితీ, పంటల భీమా లాంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ఒక్క అనంతపురం జిల్లా వాళ్లే, మొత్తంగా దోచుకుంటున్నారనే దురభిప్రాయం వుంది. ఒక ముఖ్యమంత్రే ఈ దురభాప్రాయాన్ని నాతో వెలిబుచ్చినారు. ఒక్క అనంతపురం జిల్లాలో వర్షాధార భూమి ఇతర ఆరు జిల్లాల కంటే ఎక్కువని, అంతేగాక గడచిన 14 సంవత్సరాలలో 12 సంవత్సరాలు కరువుకు గురైన జిల్లా కూడా ఒక్క అనంతపురమే అనీ, అందుకే విస్తీర్ణ ఆధారంగా ఎక్కువ పెట్టుబడి రాయితీ, పంటల భీమా మొత్తం సహజంగానే అనంతపురం జిల్లాకు కేటాయింపబడుతుందని సూటిగా చెప్పినాను. అంతేగాని ప్రభుత్వాలకు మా జిల్లా రైతుల పై ప్రేమ ఎక్కువై మాత్రము ఎక్కువ మొత్తం కేటాయించడం లేదని తెల్పినాను.

వర్షపాతం పడే తీరును బట్టి National Bureau of Soil Sciences & Land Use Planning (NBSS&LUP) బెంగుళూరు వారు అనంతపురం జిల్లాలో మూడు స్థాయిలలో పంటల నిడివి (Length of Growing Period) (అంటే విత్తినప్పటి నుండి కోత వరకు పంటకాలం) అనుకూలంగా వుంటుందని సూచించినారు. దాని ప్రకారం పడమటి అంచున వున్న హీరేహల్, బొమ్మనహల్, విడపనహల్, కనేకల్లు, రాయదుర్గం, గుమ్మగట్ట, అమరాపురం, అగలి మండలాలలో 70-90 రోజులు పంట నిడివి గల పంటలకు అనుకూలం. తూర్పు వైపున పూర్వపు కదిరి తాలూకా లోని అన్ని మండలాల నుండి తాడిపత్రి, తాలూకాలోని మండలాలలో 120-150 రోజుల పంటల నిడివికి అనుకూలం అని చెప్పడం జరిగింది. మిగిలిన అత్యధిక భాగం ఉత్తరం నుండి దక్షిణం వరకూ, నిలువునా, 44వ జాతీయ రహదారికిరు వైపుల వున్న మధ్య మండలాలలో 90-120 రోజుల నిడివి సగల పంటలకు అనుకూలం అని తెల్పినారు. వర్షం పడే తీరును బట్టి, నేలలను బట్టి ఈ విధంగా విభజించడం జరిగింది.

## 3.2 గాలిలో దీపం లాంటి బోరు బావుల క్రింద నీటి సాగు:

ఇక నీటి సాగు భూమి తీసుకుంటే మన జిల్లాలో కేవలం 1.18 లక్షల హె. (3 లక్షల ఎకరాలు) మాత్రమే. అంటే మొత్తం సాగు భూమిలో 10.9 శాతం. మన రాష్ట్రంలోని మొత్తం వ్యవసాయ భూమి 67.19 లక్షల హెక్టార్లు. అందులో మొత్తం నీటి సాగు భూమి 28.08 ల.హె. అంటే రాష్ట్ర స్థాయిలో నీటి సాగు భూమి సగటు 41.8%. మొత్తం రాష్ట్రంలో సాగు నీటి కింద వున్న భూమి 28.08 లక్షల. హె.లలో అనంతపురం జిల్లా వాటా 1.18 ల హె. తో కేవలం 4 శాతం మాత్రమే! మొత్తం మన దేశంలోనే ఇంత తక్కువ నీటిసాగు కల్గిన జిల్లా వుండదంటే ఆశ్చర్యపడవలసిన పని లేదు. ఇందులో తుంగభద్ర ఎగువకాలువ క్రింద 20 వేల నుండి 30 వేల హెక్టార్లు మాత్రము నదీ జలాల నీటి సాగు వున్నది.

కాబట్టి మిగిలిన సాగు నీరు కూడా గాలిలో దీపం లాంటి భూగర్భజలాలపైన ఆధార పడినదే. భూగర్భ జలాలను తోడడానికి రైతులే స్వయంగా బోర్లు వేయడానికి వేల కోట్లలో ఖర్చు పెట్టుకున్నారు. ఇంకా పెట్టుకుంటూనే వున్నారు. బోరు బావుల త్రవ్వకానికి గత 30 సంవత్సరాలలో రైతులు దాదాపు 6 వేల కోట్లు (ఇప్పటి ధరలలో) ఖర్చు పెట్టి వుంటారని అంచనా. ఒక పక్క వర్షాధార వ్యవసాయం విఫలం కావడం, ఇంకొక పక్క ఉన్న బోర్లు ఎండిపోవడంతో ఎక్కువగా కొత్త బోర్లు వేస్తున్నారు. 2015 సంవత్సరం మొదలులో దాదాపు 2 లక్షల బోరుబావులు పని చేస్తుండగా 2015 ఎండాకాలంలో దాదాపు 1.5 లక్షల బోర్లు ఎండిపోయినట్లు అంచనా. తిరిగి అక్టోబరు, నవంబరు నాటికి వర్షాల కారణంగా లక్ష బోర్లు కొంత నీటితో పునరుద్ధరింపబడినట్లు అంచనా. 30 సంవత్సరాల క్రితం ఒక్క సారి చెరువులు నిండితే దాదాపు మూడు సంవత్సరాల పాటు బోరుబావులలోనూ, దిగుడు బావులలో కూడా నీరుండేవి. ఇప్పుడు చెరువులు నిండిన సంవత్సరం మాత్రమే బోర్లలో నీరుండే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే భూగర్భ జలాల తోడడం విపరీతంగా పెరిగిపోయింది. అంటే బోరుబావుల క్రింద సాగు గాలిలో దీపం లాగా వుంటుందనడానికి ఇది నిదర్శనం. వరుస కరువులు, బోరు బావులు పదే పదే విఫలం కావడం వలననే అనంతపురం జిల్లాలో రైతులు పీకల లోతు రుణ భారంలో మునిగిపోయి, 1999 నుండి 2015 మధ్యకాలంలో దాదాపు మూడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు.

## 4. అనంతపురం జిల్లాలో పరిశ్రమలకు శాశ్వత కరువు:

అనంతపురం జిల్లాలో వ్యవసాయానికి ప్రకృతి వైపరీత్యాల వల్ల కరువులు సర్వ సాధారణమైతే, పరిశ్రమలకు అన్ని ప్రభుత్వాలు శాశ్వితంగా కరువు ప్రకటించాయి. 42 లక్షల జనాభా వున్న జిల్లాలో భారీ మధ్య తరహా పరిశ్రమలలో ఉద్యోగులు కేవలం 4836* మంది. వారిలో కేవలం 711* మంది మాత్రమే మహిళా ఉద్యోగులు. ఇక ఫ్యాక్టరీల చట్టం క్రింద నమోదు కాబడిన పరిశ్రమలన్నింటిలోనూ కలుపుకుంటే కేవలం 21,285* మంది మాత్రమే ఉద్యోగులు వున్నారు. వారిలో కేవలం 2500* మంది మాత్రమే మహిళా ఉద్యోగులు.

అనంతపురం జిల్లాలో పరిశ్రమలకు అనేక అనుకూల పరిస్థితులున్నాయి. జిల్లాలో భూమి విస్తారంగా, చౌకగా, అవరోధాలు లేకుండా లభ్యమవుతుంది. మానవ వనరులు బాగున్నారు. కేవలం 75 కి. మీ. దూరంలో బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు, రైల్వే లైను, 44 వ నంబరు నాలుగు లైన్ల రహదారి బెంగుళూరు - హైదరాబాదులనే కాకుండా దేశంలోని చాలా ముఖ్య పట్టణాలను కలుపుతుంది. అనంతపురం జిల్లాలో పరిశ్రమలు రాకపోవడానికి ప్రత్యేక ఆకర్షణీయ పారిశ్రామిక విధానాలు లేకపోవడం, తీవ్రమైన నీటికొరత, అధిపత్యపోరు, నిర్బంధ వసూళ్లు, సాంఘిక అభద్రత మొదలగునవి ముఖ్య కారణాలు. అనంతపురము జిల్లాలోని పారిశ్రామిక ఔత్సాహికులు కూడా ఇతర ప్రాంతాలకు పోయి పరిశ్రమలు స్థాపిస్తున్నారు. కానీ అనంతపురము జిల్లాలో పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు రావాడం లేదు. పరిశ్రమలు స్థాపించడానికి అనుకూల పరిస్థితులు కల్పించడంలో ప్రభుత్వాల వైఫల్యమే పరిశ్రమల లేమికి కారణం.

## ముగింపు:

పై విషయాలను గమనిస్తే అనంతపురము జిల్లా ప్రత్యేకత, ప్రాముఖ్యత అర్థమవుతుంది. ప్రకృతి శాపం కొంతైతే దశాబ్దల పాలకుల శాపం అందుకు తోడైంది. పాలకులు, ప్రభుత్వాలు, ప్రజలు, పౌర సంస్థలు, మేధావులు,

* According to Hand Book of Statistics 2010 of Anantapur District

విషయ నిపుణులు ఏక లక్ష్యంతో పని చేసినపుడే మన జిల్లాలో ఏదైనా మార్పు మొదలవుతుంది. పార్టీ రాజకీయాలకు, వర్గ రాజకీయాలకు అతీతంగా మన జిల్లా అభివృద్ధి కోసం ప్రాధాన్యతలు, ప్రాధమ్యాల విషయంలో ఏకాభిప్రాయం సాధించవలసి వుంది. అభివృద్ధి కోసం అన్ని పార్టీలు వర్గాలు, సంస్థలు కలిసి ఏకోన్ముఖులై పని చేయవలసి వుంది.

అయితే ఒక్క విషయం మాత్రం తీవ్రంగా పరిగణించాలి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు, లేదా రాయలసీమలోని ఇతర జిల్లాలతో పాటు మన జిల్లాను కూడా పాలకులు, ప్రభుత్వాలు భావిస్తే ఇక మన జిల్లా అభివృద్ధి గురించి శాశ్వితంగా మర్చిపోవచ్చు. అన్ని ప్రధాన రంగాలలోనూ వెనుకబడి వున్న మన జిల్లాకు నికర నదీజలాల కేటాయింపు, పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు మొదలగు విషయాలలో గట్టి రాజకీయ నిర్ణయాలు తీసుకొని తీవ్రమైన మనిహాయింపులు (exceptions) ఇచ్చి అభివృద్ధి కోసం అవకాశాలు కల్పించినపుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

# అంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా వ్యవసాయ భూమి, నీటి సాగు, వర్షపాతం వివరాలుః (డిశంబర్ 2015)

| వ.నె | జిల్లా | మొత్తం విత్తనం వేసే | | నీటి సాగు గల భూమి | | మొత్తం వర్షాధార భూమి | | | సగటు సంవత్సర వర్షపాతం మీ. మీ. | సహజ వనరుల సూచిక |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | భూమి (లక్షల హెక్టార్లు) | (రాష్ట మొత్తంలో జిల్లా వాటా) శాతం | నీటి సాగు భూమి (లక్షల హెక్టార్లు) | మొత్తం సాగు భూమిలో నీటి సాగు శాతం | వర్షాధార భూమి (లక్షల హెక్టార్లు) | మొత్తం సాగు భూమిలో వర్షాధార భూమి శాతం | రాష్ట్ర వర్షాధార భూమిలో జిల్లా వాటా | | |
| 1 | శ్రీకాకుళం | 3.21 | 4.78 % | 1.80 | 56.00% | 1.41 | 44.00% | 3.6% | 1161.6 | 0.88 |
| 2 | విజయనగరం | 3.01 | 4.48% | 1.30 | 43.00% | 1.71 | 57.00% | 4.4% | 1130.7 | 0.49 |
| 3 | విశాఖపట్టణం | 3.08 | 4.58% | 0.85 | 27.59% | 2.23 | 72.41% | 5.7% | 1202.3 | 0.81 |
| 4 | తూ.గోదావరి | 4.32 | 6.43% | 2.70 | 62.45% | 1.62 | 37.55% | 4.1% | 1216.9 | 0.89 |
| 5 | ప. గోదావరి | 4.75 | 7.07% | 3.60 | 75.78% | 1.15 | 24.22% | 2.9% | 1153.0 | 0.93 |
| 6 | క్రిష్ణా | 5.18 | 7.71% | 3.10 | 59.77% | 2.08 | 40.23% | 5.3% | 1033.5 | 0.90 |
| 7 | గుంటురు | 6.16 | 9.17% | 3.80 | 61.60% | 2.36 | 38.40% | 6.0% | 853.0 | 0.81 |
| 8 | ప్రకాశం | 6.34 | 9.44% | 2.10 | 33.00% | 4.24 | 67.00% | 10.8% | 871.5 | 0.69 |
| 9 | నెల్లూరు | 3.45 | 5.13% | 2.55 | 73.83% | 0.90 | 26.17% | 2.3% | 1080.4 | 0.85 |
| 10 | వై.యస. ఆర్ కడప | 4.07 | 6.06% | 1.55 | 38.00% | 2.52 | 62.00% | 6.4% | 699.6 | 0.56 |
| 11 | చిత్తూరు | 3.90 | 5.80% | 1.47 | 37.65% | 2.43 | 62.35% | 6.2% | 933.9 | 0.68 |
| 12 | కర్నూలు | 8.89 | 13.23% | 2.08 | 23.40% | 6.81 | 76.60% | 17.4% | 670.5 | 0.60 |
| 13 | **అనంతపురం** | **10.83** | **16.12%** | **1.18** | **10.90%** | **9.65** | **89.10%** | **24.7%** | **552.3** | **0.44** |
| | మొత్తం | **67.19** | | **28.08** | **41.80** | **39.11** | **58.2** | | **966** | |

(ఆచర్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రచురించిన సమాచారం ప్రకారం మూలంగా)

పైన పేర్కొన్న పట్టిక పరిశీలిస్తే అనంతపురం జిల్లా వ్యవసాయ పరిస్థితి ప్రత్యేకత, ప్రాముఖ్యత ప్రస్ఫుటమవుతుంది. రాష్ట్రంలోని మొత్తం వ్యవసాయ భూమి 67.19 లక్షల హెక్టార్లలో 10.83 లక్షల హెక్టర్లు అంటే 16 శాతం ఒక్క అనంతపురం జిల్లాలోనే వున్నది. ఇక నీటి సాగు భూమి తీసుకుంటే అనంతపురం జిల్లాలో కేవలం 1.18 లక్షల హెక్టార్లు అంటే కేవలం 10.9 శాతం మాత్రమే వున్నది. రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ భూమిలో సాగునీటి వసతి గల భూమి 41.8 శాతం మరీ ఘోరమయిన అంశము ఏమంటే రాష్ట్రంలో మొత్తం నీటి సాగు భూమి 28.08 లక్షల హెక్టార్లు వుంటే అందులో అనంతపురం జిల్లా వాటా 1.18 లక్షల హెక్టార్లు, అంటే కేవలం 4.2 శాతం మాత్రమే.

రాష్ట్ర సగటు సంవత్సర వర్షపాతం 966 మీ. మీ. కాగా అనంతపురం జిల్లా సగటు వర్షపాతం 552.3 మీ. మీ. మాత్రమే. ఇక సహజ వనరుల సూచిక ప్రకారం రాష్ట్రంలో అనంతపురం అత్యల్ప స్థానంలో ఒకటికి 0.44 కాగా అత్యధికంగా ప.గోదావరి వున్నది.